# 14

# దేవుని సత్య వాక్యము యొక్క విలువ

## (2 థెస్సలొనీకయులకు 2:13-3:5)

బోధకులు ప్రాముఖ్యమైన మూలపాఠములు తెలుసుకొనవలెను మరియు తప్పక వాటిని బోధించవలెను. వినువారు వారి విశ్వాసానికి పునాదిగా ఈ బోధనలను నేర్చుకొనుటకు విశేషాధికారము మరియు బాధ్యతను కలిగియున్నారు.

తిమోతికి వ్రాసిన 1 మరియు 2వ పత్రికలోను మరియు తీతుకు వ్రాసిన పత్రికలు ప్రత్యేకముగా బోధకులకొరకై ఉద్దేశించి వ్రాయబడినట్టుంది – మనము "హితబోధ" (1 తిమోతి 1:10), "సుబోధ" (1 తిమోతి 4:6; 2 తిమోతి 4:3; తీతు 1:9; 2:1), "మోసములేనిదిగాను" (తీతు 2:7), "హిత వాక్యములు" (1 తిమోతి 6:3; 2 తిమోతి 1:13), "స్వస్థబుద్ధి" (తీతుకు 1:3; 2:2 చూడు), మరియు "నమ్మదగిన బోధ" (తీతు 1:9) అనే వ్యక్తీకరణలను పదనొకొండు సార్లు కనుగొందుము. ఆయన వాక్యమును ఉపయోగించులాగున దేవునిచే సిద్ధపరచబడులాగున మనలో ప్రతి ఒక్కరు దేవుని వాక్యములోని మూల పాఠములను తప్పక తెలుసుకొవలెను.

2 థెస్సలొనీకయులకు వ్రాసిన పత్రిక 2:15లో థెస్సలొనీకయా పరిశుద్ధులు దేవుని వాక్యముతో సంబంధము కొనసాగించులాగున పౌలు వారిని ప్రోత్సహించాడు. వారికిని మరియు మనకును వాక్యానుసారమైన బోధ ఎందుకు చాలా ప్రాముఖ్యమైనదిగా ఉన్నది? దేవుని సత్య వాక్యము యొక్క విలువ ఏమిటి?

**మనలను రక్షించుటకు దేవుడు సత్యమును ఉపయోగించును (2:13, 14)**

సాతాను గుంపులో ఉన్న నశించిన ఆత్మలను దేవుని పిల్లలుగా మార్చువారెవరు? దేవుడే మార్చువాడు. నశించిన ఆత్మలను రక్షించుటకు ఆయన ఉపయోగించునదేమిటి? ఆయన వాక్యము.

మనము సువార్తచేతను, జీవ వాక్యమైన యేసుక్రీస్తు సువార్త ద్వారా పిలువబడ్డాము. దేవుడు ఒక వ్యక్తితో అనగా యేసు అను వ్యక్తితో మనకొక సందేశమును పంపెను. అందుచేతనే యేసు దేవుని వాక్యమని పిలువబడ్డాడు (యోహాను 1:1). ఆయనే మనకు దేవుని సందేశము. దేవుడు సువార్త ద్వారా మనలను నిత్య మహిమలోనికి పిలుచుచున్నాడు (2:14). దేవునిచేత పిలువబడటానికి వేరొక మార్గము లేదు. అందుచేతనే అపొస్తలులు "సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడని" సూచించబడిరి (మార్కు 16:15). కాబట్టి దేవుని పిలుపునకు స్పందించుటకును మరియు ఆయన యొక్క ఆత్మీయ దీవెనలను పంచుకొనుటకు గానీ వేరే మార్గము లేదు.

మనము దేవుని వాక్యముచే పిలువబడ్డాము; అదేవిధముగా మనము వాక్యముచేతనే రక్షించబడితిమి మరియు పవిత్రపరచబడితిమి. "... ఆత్మ మిమ్మును పరిశుద్ధపరచుటవలనను, మీరు సత్యమును నమ్ముటవలనను, రక్షణపొందుటకు దేవుడు ఆదినుండి మిమ్మును

ఏర్పరుచుకొనెను” (2:13బి). సత్యము మన విశ్వాసమును యేసునందు బాప్తిస్మము పొందులాగున నడిపించినప్పుడు మనము పరిశుద్ధపరచబడితిమి మరియు పవిత్రపరచబడితిమి. బాప్తిస్మము పొందునట్లు మనమాయన ఆజ్ఞ అంగీకరించినప్పుడు తన పరిశుద్ధాత్మ ద్వారా దేవుడు మనలను రక్షించును. అననీయ, పౌలు/సౌలుకు ఈ విధముగా చెప్పాడు, “గనుక నీవు తడవు చేయుట ఎందుకు? లేచి ఆయన నామమునుబట్టి ప్రార్థనచేసి బాప్తిస్మముపొంది నీ పాపములను కడిగివేసికొనుమని చెప్పెను” (అపొస్తలుల కార్యములు 22:16). బాప్తిస్మమునందు మన పాపములు కడిగివేయబడి దేవునితో ఏకం చేయబడుచున్నాము.

అప్పుడు రక్షణ రెండు పిలుపులుగా కనిపిస్తుంది: దేవుడు మనలను పిలుచుట మరియు మనము దేవుని పిలుచుట. మొదటి పిలుపు ఎప్పుడనగా, దేవుడు తన వాక్యముతో మనలను పిలిచినప్పుడు, సువార్తవలన బోధింపబడినప్పుడు యిది జరుగును. రెండవ పిలుపు మనము ఆ సువార్తకు స్పందించినప్పుడు. మనం వాక్యము బోధించబడి, రక్షణ యొక్క అవసరాన్ని గ్రహించినప్పుడు, మనము ఆ వాక్యమందు విశ్వాసముంచి రక్షించుమని దేవునిని ప్రార్థించుదము, మారుమనస్సు మరియు బాప్తిస్మము ద్వార సందేశమునకు విధేయులైన వారికి రక్షణ వాగ్దానము చేయబడింది.

దేవుని బోధకు మన విధేయతను చూపుటయే దేవుని రక్షణ అవకాశమును అంగీకరించు విధానము. “మీరు పాపమునకు దాసులై యుంటిరి గాని యే ఉపదేశ క్రమమునకు మీరు అప్పగింపబడితిరో, దానికి హృదయ పూర్వకముగా లోబడినవారై, పాపమునుండి విమోచింపబడి నీతికి దాసులైతిరి. ఇందుకు దేవునికి స్తోత్రము” (రోమీయులకు 6:17, 18).

### మనలను బలపరచుటకు దేవుడు సత్యమును ఉపయోగించుచున్నాడు (2:15)

మనము ఒకసారి రక్షించబడిన తరువాత, మనలను బలపరచుటకును మరియు ప్రోత్సహించుటకును దేవుడు తన వాక్యమును ఉపయోగించును. మనము ఎదుగుటకును, వృద్ధి చెందుటకును, మరియు మన జీవితములో ఫలములను ఫలించుటకును ఆ వాక్యము మనకు సహకరించగలదు.

ఇది ఎలా జరుగును? దీనికి సమాధానము 2:15లో ఉంది: “కాబట్టి సహోదరులారా, నిలుకడగా ఉండి, మా నోటిమాటవలనైనను మా పత్రిక వలనైనను మీకు బోధింపబడిన విధులను చేపట్టుడి” [“బోధనలు”; NIV]. ఈ విధులు (ఆచారములు) మానవ ఆలోచనపూరితమైనవి కావు కానీ దైవావేశమువలన కలిగిన ఆజ్ఞలు. ఈ థెస్సలొనీకయులు మొదటి పత్రికను స్వీకరించినప్పుడు నోటిమాటవలనైనను మరియు అదేవిధముగా వ్రాత పూర్వకముగా బోధను స్వీకరించిరి.

క్రైస్తవులకు వారి అభివృద్ధి కొరకును మరియు ఎదుగుదలకొరకును దేవుని బోధ అవసరమైనది. ఈ బోధ అప్పటికే కొంతమందికి ఇవ్వబడినది. దేవుని వాక్యములో వారికి అందించబడిన సత్యము యింకను చాలాకుండియుండినది. వారు నూతనమైనది మరియు విభిన్నమైన సమాచారము కావాలని కోరుకున్నారు; దేవుడు అప్పటికే వారికి అప్పగించినదానితో తృప్తిపొందకుండిరి. దీని ఫలితముగా వారు దేవుని వాక్యమును నిర్లక్ష్యముచేసి దాని స్థానంలో వేరేదానిని ఉంచి దేవుని శక్తిని కోల్పోయిరి. విభిన్నమైన బోధ ఆకర్షణీయంగా

లేదా ఆసక్తికరంగా ఉండవచ్చు; కానీ అది దేవుని శక్తికానందున అధికారములేనిదిగా ఉంది. కేవలము దేవుడు మాత్రమే అధికారాన్ని కలిగియున్నాడు. మనలను రక్షించుటకును మరియు బలపరచుటకును కేవలము దేవుడు మాత్రమే తన వాక్యమును ఉపయోగించగలడు!

క్రైస్తవులకు తమ నిరంతర అభివృద్ధికి, పోషణకు, మరియు ఫలించుటకు దేవుని వాక్యము అవసరం. లూకా 8వ అధ్యాయములో యేసుచేత చెప్పబడిన నేలను గూర్చి ఉపమానములో వేగముగా పెరిగినవారు, అభివృద్ధి చెందినవారు ఎవరనగా తమ హృదయములో దేవుని వాక్యమును పూర్తిగా ఉపయోగించినవారు. అదేవిధముగా, దేవుడు అంగీకరించిన విధానములో అభివృద్ధి చెందాలంటే మనలను నడిపించునట్లుగా దేవుని వాక్యమును ఉపయోగించవలసిన వారమైయున్నాము.

## మనలను ఆదరించుటకు దేవుడు సత్యమును ఉపయోగించుచున్నాడు (2:16, 17)

దేవుని వాక్యము దేవుడు కోరుకున్నట్టు మనము చేయటానికి మనకు బలమిచ్చుట మాత్రమే కాక, అది మనకు ఆదరణ మరియు నిరీక్షణను యిచ్చును. దేవుడు తన వాక్యము చేత మనకందించుచున్న భద్రత మరియు స్థితిని బట్టి మనలను ప్రోత్సహించాలనుకుంటున్నాడు. నిరుత్సాహపడ్డవారిని ప్రోత్సహించుటకు బైబిలునంతయు ఉపయోగించవచ్చును. పౌలు యిలా అన్నాడు, "ఏలయనగా ఓర్పువలనను, లేఖనములవలని ఆదరణవలనను మనకు నిరీక్షణ కలుగుటకై పూర్వమందు వ్రాయబడినవన్నియు మనకు బోధ కలుగునట్లు వ్రాయబడి యున్నది" (రోమీయులకు 15:4).

దేవుని దయాగుణము, ఆలోచన, మరియు కాపుదలగలిగిన దేవుని గుణము "కనికరము చూపు తండ్రి సమస్తమైన ఆదరణను అనుగ్రహించు దేవుడుగా" (2 కొరింథీయులకు 1:3బి) వర్ణించుట ద్వారా ఆయనచే ప్రత్యేకపరచబడి చూపబడినది. శ్రమకాలమందు థెస్సలొనీకయానందున్న క్రైస్తవులను ప్రోత్సహించుటకు యేసు మరియు దేవుని ప్రేమగల ఆదరణ ఒక విలువైన ఆస్తిగా ఉండియుండినది, "మన ప్రభువైన యేసు క్రీస్తును, మనలను ప్రేమించి, కృపచేత నిత్యమైన ఆదరణయు, శుభ నిరీక్షణయు అనుగ్రహించిన మన తండ్రియైన దేవుడును, మీ హృదయములను ఆదరించి, ప్రతి సత్కార్యమందును ప్రతి సద్వాక్యమందును మిమ్మును స్థిరపరచును గాక" (2:16).

## మనలను కాపాడుటకు దేవుడు సత్యమును ఉపయోగించుచున్నాడు (3:1-5)

సాధారణముగా మానవ దేహాలకు నష్టము కలిగించువాటిని గూర్చి మనము ఎరిగియే ఉంటాము. మనము మంచి పదార్థాలను తినటానికే ప్రయత్నిస్తాము, రోడ్డుపై జాగ్రత్తగా నడవడానికి ప్రయత్నిస్తాము, మంటలతోను మరియు విద్యుత్‌తోను జాగ్రత్తగా ఉండటానికి ప్రయత్నిస్తాము, మరియు మన శరీరాలను రక్షించడానికైన యితర చర్యలన్ని తీసుకుంటాము. అయితే శరీరాలు మాత్రమే కాదు కానీ ఆత్మలు కూడ పాడవుతూ ఉంటాయి. మన ఆత్మను నాశనం చేయు లక్ష్యముతో సాతాను సమస్త చెడు ప్రభావాలను సమకూర్చుటను పర్యవేక్షించుచున్నాడు. మనకు అపాయము కలిగించువాటినన్నింటిని మంచివని అతడు

చెప్పుచున్నాడు. అసత్యము సత్యమని అతడు చెప్పుచున్నాడు. అతడు ప్రజలను, వస్తువులను, మరియు ఆలోచనలను అన్నింటిని తీసుకొని మనకు అపాయము జరుగునట్లు వాటిని మార్చివేయగలడు! మన ఆత్మలను ఆక్రమించుకొనుటకు దేనినైనా ఎవరినైనా సాతాను ఉపయోగించగలడు.

మన ఆత్మలపై గల ఈ దాడిని ఎదిరించుటకు శక్తిగలవారెవరు? మనము సాతాను యొక్క వలలో మరలా చిక్కుకొనకుండా మన జీవితములను నడిపిస్తూ కేవలము దేవుడు మాత్రమే క్రీస్తుద్వారా పాపమునుండి మన ఆత్మలను రక్షించగలడు. కేవలము దేవుని వాక్యము మాత్రమే మనలను అసత్యమునుండి మరియు సాతాను యొక్క అడ్డంకినుండి రక్షించును. కేవలము దేవుని వాక్యము మాత్రమే మన దైనందిక జీవితాలకు కావలసిన మార్గ దర్శకత్వమును అందించును: "ప్రభువు నమ్మదగినవాడు; ఆయన మిమ్మును స్థిరపరచి దుష్టత్వమునుండి కాపాడును" (3:3).

కేవలము దేవుని వాక్యము మాత్రమే సాతానునుండి కాపాడగలదు గనుక, మనము సాధ్యమైనన్ని హృదయాలకు తప్పక దేవుని వాక్యమును విస్తరింపజేయవలెను. భూమిపైగల ప్రతివారును – ధనికుడినుండి పేదవాడివరకు అందరికి ఈ వాక్యము కావలెను. సాతాను దాసుల చెడ్డ ప్రభావమునుండి కాపాడుకొని వారి జీవితములలో వాక్యము కాపుదల ప్రభావము విస్తరించులాగున ప్రార్థించమని పౌలు క్రైస్తవులను కోరియున్నాడు: "తుదకు సహోదరులారా, మీలో జరుగుచున్న ప్రకారము ప్రభువు వాక్యము శీఘ్రముగా వ్యాపించి మహిమ పరచబడు నిమిత్తము, మేము మూర్ఖులైన దుష్టమనుష్యుల చేతిలోనుండి తప్పింపబడు నిమిత్తమును, మాకొరకు ప్రార్థన చేయుడి; విశ్వాసము అందరికి లేదు" (3:1, 2).

## ముగింపు

సత్యము ఎల్లప్పుడు సత్యమే, అయితే దేవుని సత్యము దానికంటే ఎక్కువైనది. ఇది జీవమునకు మార్గమును మరియు పాపమునుండి విడుదల. ఇది రక్షించుటకును, వృద్ధి నిచ్చుటకును, మరియు ఆదరణకును శక్తియైయున్నది. "కాబట్టి ... మీరు నా వాక్యమందు నిలిచినవారైతే నిజముగా నాకు శిష్యులైయుండి సత్యమును గ్రహించెదరు. అప్పుడు సత్యము మిమ్మును స్వతంత్రులనుగా చేయును" అని యేసు చెప్పాడు (యోహాను 8:31, 32). నిజమైన యేసు శిష్యులు యేసు బయలుపరుచుటకు వచ్చిన సత్యము యొక్క విలువను చూచిరి. కనుగొనండి, విశ్వచించుడి, మరియు దేవుని సత్యము యొక్క విలువను కనుగొనండి!

మనమాయన వాక్యమును చదువుకొని యితరులతో పంచుకొనినప్పుడు, యితరులకు సహకరించి, దేవునికి మహిమ కలుగజేయు విలువైన ఫలములను ఫలించును. "ఇది ప్రతి సత్కార్యం మరియు ప్రతి సద్వాక్యము" యొక్క విలువైన ఫలములను ఫలించును (2:17).

దేవుని వాక్యముతో నిండిన హృదయాలు భక్తిగల హృదయాలుగా ఉండును. అవి దేవుని మరియు క్రీస్తు హృదయములవలే ఉండును. అవి మాటలయందును క్రియలయందును, ఆలోచనయందును దేవుని స్వభావమును పాలుపుచ్చుకొన్నవిగా, అవి ఆదరణ, ప్రేమ, మరియు అధికారముగల హృదయములుగా ఉండును! దేవునికొరకు విలువైన ఫలములు ఫలించులాగున, సమస్త దుర్నీతినుండి తప్పించుకొనులాగున, బలముతోను, ఆదరణతోను అభివృద్ధి చెందులాగున, నూతన ఆత్మీయ జీవతములను ప్రారంభించులాగున తన

వాక్యమును ఉపయోగించునట్లు దేవుడు మనకు సహకరించును గాక. 3:5 మాటలలో చెప్పినట్లు, “దేవునియందలి ప్రేమయు క్రీస్తు చూపిన ఓర్పును మీకు కలుగునట్లు ప్రభువు మీ హృదయములను ప్రేరేపించును గాక.”